కథ

# కంప్యూటర్ సావీ... ఫ్యామిలీ

ప్రతాప వెంకట సుబ్బారాయుడు-9393981918

**కామేష్ చిన్నపిల్లాడిగా ఉన్నప్పుడు అన్నప్రాసన కార్యక్రమంలో బ్రాహ్మణుడు అతని ఎదురుగా అన్ని వస్తువులూ పెడుతూ సరదాగా 'మనం అభివృద్ధిపథంలో తీవ్ర వేగంగా ప్రయాణిస్తున్నాం కాబట్టి, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ కూడా పెట్టండి' అన్నాడు నవ్వుతూ. దాంతో అవి కూడా పెట్టారు.**

**కామేష్ పాకుతూ వెళ్లి ఒక చేత్తో సెల్‌ఫోన్, మరోచేత్తో ల్యాప్‌టాప్ పట్టుకున్నాడు. అది చూసి అందరూ సరదాగా నవ్వుకున్నారు. మురిసిపోయారు కానీ, అదే తర్వాత్తర్వాత వాళ్ల కొంప ముంచింది. ఆ విధానంబెట్టిదనగా..**

కామేష్ శుక్లపక్ష చంద్రునిలా దిన దినాభి వృద్ధి చెందుతూంటే ఎలాక్ట్రానిక్ గాడ్జెట్స్ పట్ల అతని అభిరుచి కూడా పెరగసాగింది. చిన్న ప్పట్నుంచి వీడియోలో బొమ్మలు చూస్తూ బువ్వ తినడం, స్కూల్లో చేరాక చదువుకన్నా కంప్యూ టర్‌లో గేమ్స్ ఆడడంలో ఆసక్తి కనబరచడం, రకరకాల సైట్స్ విజిట్ చేసి వింతలు విశేషాలు చూడడం ఇలా పెరిగి పెద్దవసాగాడు.

కంప్యూటర్ సావీ కాబట్టి సాఫ్ట్ వేర్ ప్రోగ్రా మర్ అయ్యాడు.

అదేకాకుండా ఆండ్రాయిడ్ లేటెస్ట్ ఫోన్ తీసుకుని, అయితే ల్యాప్టాప్ కాకుంటే సెల్ ఫోన్తో అతుక్కుపోయి ఉండేవాడు. అవే అతని ప్రపంచం. అంతే అయితే ఈ కథ రాయాల్సిన అవసరం నాక్కలిగేది కాదు కానీ ఇంట్లో అంద రికీ ఆ పిచ్చి పట్టించాడు.

అతని తండ్రి మంచి వాస్తువిద్వాన్, జోతి ష్కుడు. ఎవరికైనా అవసరం వస్తే పంచాంగం తీసి లెక్కలు చూసి ఖచ్చితంగా ముహూర్త కాలాలు, వాస్తు పుస్తకాలు చూసి వాస్తు మార్పులూ చెప్పేవాడు.

ఒకనాడు-“నాన్నారూ...ఈ కాలంలో కూడా బండెడు పుస్తకాలు రిఫర్ చేసి టైం వేస్ట్ చేసుకుంటారా? మీ సెల్‌ఫోన్‌లో ఇదిగో ఈ యాప్ డౌన్ లోడ్ చేశాను. వచ్చినతని పేరు, నక్షత్రం తదితరాలు ఎంటర్ చేసి ఇదిగో ఇలా ఇది నొక్కితే... చూడండి మీక్కావలసింది వచ్చేస్తుంది. అంతేకాదు మీకు చెస్ ఆడడం ఇష్టం కదా! ఇదిగో మీతో ఇలా కంప్యూటర్ చెస్ ఆడుతుంది” అన్నాడు.

ఆయన ఆశ్చర్యంతో ముక్కు మీద వేలేసు కుని- 'ఔరా! శ్రీకృష్ణుడి నోటిలో భువన భాండాలు కనిపించినట్టు ఈ చిన్న దాంట్లో ఇంత విషయముందా? పాండిత్యం కరతలా మలకమవడమంటే ఇదే కామోసు' అనుకుని ఆరోజు నుంచీ దానికి అతుక్కుపోయాడు.


ఎవరు ఏ సమస్యతో వచ్చినా దర్జాగా జేబు లోంచి ఫోన్ తీయడం క్షణాల్లో కావలసింది చెప్పడం... డబ్బులు తీసుకోవడం... ఆయన 'బిజి'నెస్ పెరిగిపోయింది.

కామేషం ఓ రోజు వంట చేస్తున్న తల్లి దగ్గరకు చేరాడు- “అమ్మా? ఎన్నాళ్లిలా వంకా యపులుసు, బీరకాయపప్పులతో మాకొండి పెడతావు? చిరాకెయ్యట్లేదూ!? ఇదిగో సెల్ ఫోన్‌లో నీకో యాప్ డౌన్‌లోడ్ చేశాను. దీంట్లో సులువుగా అయ్యే వంటల దగ్గర్నుంచి... కాంప్లికేటేడ్ రెసిపీస్ వరకూ అన్నీ ఉంటాయి. చక చకా అలా చేసి పడేసి, హాయిగా ఇలా స్త్రీలకు సంబంధించిన సైట్స్ కెళ్లి కొత్త కొత్త విషయాలు నేర్చుకో. నువ్వు వంటింటి కుందే లువు కాదమ్మా!... టెక్నాలజి పులివి' అన్నాడు.

దాంతో ఆవిడ ఆ మత్తులో కూరుకు పోయింది.

ఆ తర్వాత తన తమ్ముడు మార్కులు తక్కు వస్తున్నాయని ట్యూషన్ పెట్టించమని తండ్రి నడగడం చూసి “ఒరేయ్..నువ్వెంత వెనకబడి ఉన్నావురా? ఇప్పుడెవరన్నా ట్యూషన్ల కెళతా రా? చక్కగా కంప్యూటర్‌లో ఆన్‌లైన్ క్లాసెస్ ఉంటాయి.శ్రద్ధగా హెడ్‌ఫోన్స్ పెట్టుకుని విన్నా వంటే,ఫస్ట్‌క్లాస్ కాదు. డిస్టింక్షన్ నీదే” అన్నాడు.

దాంతో అతని తమ్ముడు కంప్యూటర్ పురు గు అయిపోయాడు (క్షమించండి, పుస్తకాల పురుగును ఇప్పటి కాలానికి అనుసంధా నించాను).



బామ్మ దగ్గరకెళ్లి "వృద్ధాప్యాన్ని ఎలా ఆనం దంగా గడపాలి? మీకొచ్చే చిన్న సమస్యలకు పరిష్కారాలేంటి? ఏ రోజున ఏ పూజ ఎలా చెయ్యాలి? అన్నీ ఇదిగో ఈ సైట్‌లో పొందు పరిచారు. మాతోపాటు నువ్వూ హాయిగా అప్ గ్రేడ్ అవవే బామ్మా..."అన్నాడు.

ఆవిడా కంప్యూటర్ కు అతుక్కుపోయింది.

ఇవే కాకుండా తమ ఫోన్లలో వాట్సప్‌కు, ఫేస్‌బుక్ పోస్ట్‌లకు లైకులు కొట్టడం, మెసేజ్ లు పంపడం.. ఇత్యాది వాటితో ఆ ఫ్యామ్లీ మొత్తం తెగ బిజీ అయిపోయింది. కాలం వాళ్ల విషయంలో నల్లేరుపై బండిలా సాగుతోంది.

అయితే విధి అనేది ఒకటి పొంచుంటుం ది కదా!అది ఉపద్రవాలు సృష్టించి వికటాట్ట హాసం చేస్తుందని మనందరికీ తెలుసు. మరి వాళ్ల విషయంలో ఏం చేసిందంటే....

✦✦✦

"ఒరేయ్ కాముడూ..పూర్ణారావుగారింట్లో శుభకార్యానికి ముహూర్తం పెట్టి వస్తుంటే దారిలో సెల్ ఫోన్ పడిపోయిందిరా. అందులో చాలా మంది ఫోన్ నెంబర్లతో పాటూ, చాలా విషయాలు నిక్షిప్తమై ఉన్నాయి. పైగా శ్రీధరం గారి కూతురి పెళ్లికి ముహూర్తం పెట్టాలిట. వెధవది చాలాకాలం నుంచి పుస్తకాలు ముట్టుకోక పోవడం వల్లను... బుజ్జి ముండ ఆ ఫోనే అన్నీ చిటికెలో అందించేయడం వల్లనూ, పుస్తకాలు చూడ లేని బద్ధకం వచ్చేసింది. నాకు ఊపిరి ఆడడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు."అన్నాడు తండ్రి ఆందోళనగా.

"అన్నయ్యా! సబ్జెక్ట్స్ రాసు కోవడమెందుకని కంప్యూటర్ మెమరీలో కావలసినవన్నీ సేవ్ చేసి పెట్టుకున్నాను. ఇప్పుడు అవి ఓపెన్ అవడం లేదు. వారం రోజుల్లో పరీక్షలు. భయంగా ఉందన్నయ్యా"అని బావురు మన్నాడు తమ్ముడు.

"ఒరేయ్ కాముా! నిన్న ఫోన్లో చూస్తూ కొత్త వంటకం తయారు చేస్తుంటే, ఫోన్ పొరబాట్న కింద పడిపోయిందిరా. అది పనిచెయ్యనని మొరాయిస్తోంది. నాకు కుడి చెయ్యి పోయి నట్టుగా ఉంది. దాంట్లో చూస్తే తప్ప వంట చేయలేను. అన్నీ మర్చిపోయాను. ఏదో ఒకటి చేసి నా ఫోన్‌కు ప్రాణం పోయరా!"అంది దీనంగా అమ్మ!

"ఒరేయ్.. నాకో ల్యాప్‌టాప్ కొనివ్వరా. ఈ వృద్ధాప్యాన్నీ హాయిగా చీకూ చింతా లేకుండా గడిపేస్తాను" అంది బామ్మ.

"మీ అందరి సమస్యలు చాలా సింపుల్... వర్రీ అవకండి. మనుషులకే రోగాలొచ్చి మూల న పడతారు... మనిషి తయారు చేసినవి... ఇవెంత?... మీరు కంగారు పడకుండా ఉంటే.. నేను ఇతరులకు ఇలాంటి సమస్యలు వస్తే ఎలా పరిష్కరించుకున్నారో గూగుల్ లో వెదికి చెబుతాను. నేను ఆఫీసు పనిమీద మొన్నటి నుంచి ఒక ప్రోగ్రాం రాస్తున్నాను.అదో అర గంటలో పూర్తవుతుంది. అది అయిపోంగానే మీ పనిమీదే ఉంటాను. సరేనా?" అని తన ల్యాప్టాప్ తెరిచి ఐదు నిముషాల్లో కెవ్వ్... కెవ్వ్... అని కేకలేశాడు. కారణం అతని ల్యాప్ టాప్ క్రాష్ అయింది. అతను ఎట్టి పరిస్థితుల్లో రేపు ప్రోగ్రాం సబ్మిట్ చెయ్యాలి.

ఆ ఇళ్లంతా భోరుమంటోంది.

భోరు భోరుమంటోంది.

*(టెక్నాలజీని అడాప్ట్ చేసుకోవడం వేరు..దానికి అడిక్ట్ అవడం వేరు.అడిక్ట్ అయితే ఫలితం ఇలాగే ఉంటుందన్న ఊహే ఈ కథకు ప్రేరణ)*

